క్లుప్తంగా

గృహ నిర్మాణాల పరిశీలన


గృహ నిర్మాణ లబ్ధిదారునితో మాట్లాడుతున్న అధికారులు

టి.నరసాపురం: గ్రామీణ గృహనిర్మాణ పథకం ఇళ్లను కేంద్ర గ్రామీణ మంత్రిత్వ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. స్థానిక గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పథకం అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలోని బొర్రంపాలెంలో 60 ఇళ్లు, తిరుమలదేవిపేటలో 21 ఇళ్లు 2021–22 సంవత్సరంలో మంజూరు కాగా, వాటిని లబ్ధిదారులు నిర్మించుకున్నారన్నారు. అయితే ఈ పథకానికి సంబంధించి నగదు పూర్తిగా అందిందో లేదో వారి బ్యాంకు ఖాతాలను పరిశీలించి తెలుసుకోవడం జరిగిందన్నారు. అలాగే ఉపాధి పథకం నిధుల సద్వినియోగం అయ్యాయా లేదా అనే విషయంతో పాటు ఆధార్, రేషన్ కార్డులను, గృహ నిర్మాణ దశల ఫొటోలను తనిఖీ చేశారు.

శ్రీవారి సేవలో కొవ్వూరు ఎమ్మెల్యే


శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని, ప్రసాదాలను అందజేశారు.

ప్రమాదవశాత్తూ లారీ కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

చింతలపూడి: ప్రమాదవశాత్తూ లారీ కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి నరసాపురం మండలం, మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన అబ్బదాసరి వెంకటేష్ మంగళవారం ద్విచక్ర వాహనంపై ఏలూరు నుంచి వస్తున్నాడు. చింతలపూడి పట్టణంలో పామాయిల్ లోడుతో వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న మరో వాహనానికి తగిలి లారీ కింద పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వెంకటేష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితునికి కాలు పూర్తిగా నుజ్జు అయ్యింది. ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి


ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సామాజిక కార్యకర్త నాసర్ పాషా

చింతలపూడి: చింతలపూడి – టి.నరసాపురం ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని, అలాగే చింతలపూడి మున్సిపాలిటీకి చెత్త డంపింగ్ యార్డ్‌కి స్థలం కేటాయించాలని కోరుతూ టి నరసాపురానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా మంగళవారం ఎమ్మెల్యే సొంగా రోషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాసర్‌పాషా మాట్లాడుతూ టి నరసాపురం ప్రధాన రహదారి గోతులమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ రోడ్డు మరమ్మతులతోపాటు రోడ్డు విస్తరణకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా చింతలపూడి నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామం అల్లిపల్లి రోడ్డు రోడ్డుని బాగు చేయించే విషయంలో చొరవ చూపాలన్నారు. దీంతోపాటు చింతలపూడి మున్సిపాలిటీకి డంప్‌యార్డ్ లేకపోవడంతో టి.నరసాపురం రోడ్డులో గుర్రాజు కుంట చెరువు వద్ద చెత్తను డంప్ చేస్తున్నారని దీంతో ఈ ప్రాంతం అధ్వానంగా తయారవుతుందన్నారు. శాశ్వత పరిష్కారంగా చెత్త డంపింగ్ యార్డ్ కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు పాషా తెలిపారు, ఈ కార్యక్రమంలో సయ్యద్ ఘుమ్ షావలి, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు ఇలా.. వెళ్లేదెలా..


గోతులమయంగా చింతలపూడి-సత్తుపల్లి ప్రధాన రహదారి


రేచర్లలో చెరువును తలపిస్తున్న మెయిన్ రోడ్డు


యర్రగుంటపల్లి సమీపంలో వర్షాలకు ధ్వంసమైన రోడ్డు

- వర్షాలకు అధ్వానంగా మారిన రహదారులు
- గోతుల్లో నిలిచిపోతున్న వర్షం నీరు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు, వాహనచోదకులు

చింతలపూడి: ఒక పక్క రుతుపవనాలు, మరో పక్క అల్ప పీడనం ప్రభావంతో మెట్ట ప్రాంతంలో గత వారం రోజుల నుంచి వర్షాలు పడుతున్నాయి. ఈ వర్షాలకు రోడ్లపైకి నీరు చేరి మెయిన్ రోడ్డు పలు చోట్ల దెబ్బతిన్నాయి. చింతలపూడి, సత్తుపల్లి రోడ్డు, కామవరపుకోట రహదారి, టి.నరసాపురం రహదారి, చింతలపూడి మెయిన్ రోడ్డు వర్షాలకు గోతులు పడి ప్రమాదకరంగా మారాయి. పట్టణంలో సరైన డ్రెయినేజీ సదుపాయం లేకపోవడం కారణంగా వర్షపునీరు రోడ్లపై చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షాలకే రోడ్లు బురద గుంటల్లా తయారవుతున్నాయి. వర్షపు నీరు బయటికి పోయే అవకాశం లేక రోడ్లపైనే మోకాలి లోతు నీరు నిలిచిపోతోంది. రోడ్డుపై గుంటలు కనపడక వాహనదారులు వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా చింతలపూడి నుంచి సత్తుపల్లి వెళ్లే ప్రధాన రహదారి రేచర్ల, యర్రగుంటపల్లి గ్రామాల మధ్య చెరువులను తలపిస్తోంది.

గ్రామీణ రహదారులూ అధ్వానమే

ప్రధాన రహదారులే కాక వర్షాలకు గ్రామీణ రహదారులు సైతం అధ్వానంగా తయారవుతున్నాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. చినుకు పడితే కనీసం నడవడానికి కూడా అవకాశం లేకుండా ఛిద్రమవుతున్నాయి. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు చింతలపూడి పట్టణంలోని మారుతీనగర్, ఎస్‌వీఎస్ కాలనీ, ఆంథోని నగర్, గణేష్ కాలనీ, ఛార్లెస్ నగర్ వెళ్లే రహదారులు దారుణంగా తయారయ్యాయి.

రోడ్లు అభివృద్ధి చేయాలి



ప్రతి ఏటా వర్షాకాలంలో రోడ్లు అధ్వానంగా తయారవుతురన్నాయి. పెద్ద, పెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్లు మరమ్మతు చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్లు అభివృద్ధి చేయాలి.

– పిడపర్తి ముత్తారెడ్డి, పౌరహక్కుల సంఘం నాయకులు, యర్రగుంటపల్లి

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ


కొయ్యలగూడెంలోని ఎస్సీ వార్డులోని ఎంపీపీ స్కూల్లో పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

కొయ్యలగూడెం: కొవ్వూరు రోడ్‌లోని ఎస్సీ పేట మూడవ వార్డు స్కూల్లో విద్యార్థులకు మంగళవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముప్పిడి విజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చదువులో రాణించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వార్డ్ మెంబర్లు ఊసల దివ్య రాజేష్, పూలపల్లి రవి కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ తానేటి పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఐసీడీఎస్ పీడీ పద్మావతి


లక్ష్మీపురంలో డయేరియా నివారణపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ పద్మావతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా బుట్టాయగూడెం మండలం లక్ష్మీపురంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డయేరియా నిర్మూలనపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమం అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదేళ్ల లోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వడంతో పాటు రెండు వారాల జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తారని చెప్పారు. కేఆర్‌పురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి మౌనిక మాట్లాడుతూ డయేరియా వంటి సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలుషితమైన నీరు, ఈగలు, దోమలు వాలిన ఆహారం తీసుకోవడం వల్ల వాంతులు, విరేచనాలకు గురవుతారని చెప్పారు. ఎప్పటికప్పుడు చేతులను సబ్బుతో శుభ్రంగా కడగాలని అన్నారు. వంట పాత్రలపై తప్పనిసరిగా మూతలు పెట్టాలన్నారు. ఎవరైనా డయేరియాకు గురైన వారు అందుబాటులో ఉన్న ఆస్పత్రులకు వెళ్లి సకాలంలో వైద్యం పొందాలన్నారు. డయేరియా నివారణపై జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ప్రజలకు పూర్తి అవగాహన కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు ఈ.తులసి, రాజశేఖర్, స్వర్ణ కుమారి, సీహెచ్ఓ గంగాదేవి, హెచ్ఎస్ దేవరాజు, హెచ్‌వీ సరస్వతి, సూపర్‌వైజర్ ఎస్‌వీ సత్యావతి, ఏఎస్ఎం మంగతాయారు, అంగన్‌వాడీ వర్కర్లు అనితకుమారి, పుష్ప, ఆశా వర్కర్ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలను చెల్లించాలి


మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ద్వారకాతిరుమల: దొండ పందిళ్లకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎం.నాగులపల్లిలో మంగళవారం నిర్వహించిన రైతు సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 10, 11 తేదీల్లో స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంఘం కూరగాయల షెడ్‌లో నిర్వహించే రైతు సంఘం జిల్లా స్థాయి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో అన్ని మండలాల నుంచి ఎంపిక చేసిన రైతు ప్రతినిధులు ఇందులో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షుడు బోయపాటి సత్యనారాయణ, మండల కార్యదర్శి కట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



జంగారెడ్డిగూడెంలో ఓ షాపు వద్ద రోడ్డుపైకి తెగిపడి వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో మంగళవారం స్థానికులు అప్రమత్తతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులోని షాపునకు సంబంధించిన ఫ్లెక్సీ విరిగిపోయి 11 కేవీ వైర్లపై పడింది. దీంతో భారీగా మంటలు వచ్చి 11 కేవీ వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. ఇది గమనించిన చుట్టుపక్కల షాపుల యజమానులు అప్రమత్తమై ఆ రోడ్డు గుండా వాహనాలు వెళ్లకుండా మోటార్‌సైకిళ్లను అడ్డుగా పెట్టి రాకపోకలను అడ్డుకున్నారు. అలాగే ఘటనకు సంబంధించి సమాచారాన్ని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేశారు. వారు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి విద్యుత్ వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రధాన రహదారి కావడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ ప్రాంతం ఘటన జరిగిన సమయంలో జనసంచారం లేకపోవడం, వెంటనే స్థానికులు అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పలువురు చెప్పారు.

పని భద్రత కల్పించాలి

జంగారెడ్డిగూడెం: హమాలీలకు పనిభద్రతతో ఉన్న సమగ్ర చట్టం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. స్థానిక గవర్నమెంట్ టింబర్ డిపో వద్ద మంగళవారం జరిగిన హమాలీల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హమాలీలకు సమగ్ర చట్టం చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలు నిలబెట్టుకోవాలన్నారు. పనిభద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ పింఛన్ తదితర సౌకర్యాలతో చట్టం చేయాలని, హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో యడ్లపల్లి బుజ్జియ్య, వై.సుబ్బారావు, పింగుళ నాగేశ్వరరావు, మనేల్లి మహిమారావ్, తదితరులు పాల్గొన్నారు.

వాహన నిబంధనలు పాటించాలి


జంగారెడ్డిగూడెంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ పి.రాజేష్, ట్రాఫిక్, పోలీసు సిబ్బంది

జంగారెడ్డిగూడెం: నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని సీఐ పి.రాజేష్ వాహనదారులకు సూచించారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్సులు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనదారులకు జరిమానాలు విధించారు. అలాగే ఆయా వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహన నిబంధనలు రూపొందించడం జరిగిందన్నారు. దీనిని ప్రతి ఒక్క వాహనదారుడు పాటించాల్సిందే అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్‌కు వాహనాలు ఇవ్వడం ఇవన్నీ నేరాలే అన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారికి జరిమానాలతో పాటు చట్టపరమైన శిక్షలు కూడా ఉన్నాయని సీఐ తెలిపారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలంటే నిబంధనలు పాటించాలని సూచించారు. ఒకరి అజాగ్రత్త అతని కుటుంబంతో పాటు, ప్రమాదాల పాలైన వారి కుటుంబాలను కూడా చిన్నాభిన్నం చేస్తుందని, కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ వాహన తనిఖీల్లో ఎస్సై జి.జ్యోతిబాస్, ట్రాఫిక్ ఎస్సై జె.రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ వ్యాప్తిని అరికట్టేందుకు సహకరించాలి


యర్రగుంటపల్లి పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చింతలపూడి: ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీని అదుపులో ఉంచవచ్చని యర్రగుంటపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ నరేష్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలో చింతలపూడి సబ్ యూనిట్ ఆధ్వర్యంలో డెంగీ మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. డెంగీ వ్యాప్తిని కలగజేసే దోమలు మంచినీటిలో పెరుగుతాయని, కావున ఇంటి పరిసరాల్లో కూలర్లు, ఫ్రిడ్జ్‌లు, పూలకుండీలలో, పాత టైర్లు, పాడైపోయిన ప్లాస్టిక్ వస్తువులు, చెల్లాచెదురుగా పడవేయరాదన్నారు. వాటిలో దోమల లార్వా పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. కావున దోమలు పుట్టకుండా చర్యలు తీసుకోవడంతో పాటు దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. డెంగీ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.గీత, చింతలపూడి సబ్‌యూనిట్ అధికారి ఎస్‌ఏ ప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, పీహెచ్ఎన్ రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఉమ్మడి రాజారావు, ఎస్‌డీ రసూల్, హెచ్‌డబ్ల్యూసీ, సీహెచ్‌వోలు, ఏఎస్ఎంలు, ఆశాలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ


ప్రిన్సిపాల్ విజయ్‌బాబు

కామవరపుకోట: ఆడమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 2వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 5వ తేదీన దరఖాస్తుల పరిశీలన, 11 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు, 19న సీట్ల కేటాయింపు, 20 నుంచి 22వ తేదీ వరకు సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేయవలసి ఉంటుందని అన్నారు. జూలై 22న తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో చేరబోయే మహిళా విద్యార్థులకు ఉచితంగా హాస్టల్ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు కోరారు.

పచ్చిరొట్ట సాగుతో భూమికి మేలు


పచ్చిరొట్ట వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా

టి.నరసాపురం: పచ్చిరొట్టల సాగుతో భూసారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పచ్చి రొట్ట విత్తనాలను సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను పెంచడంతో పాటు, వాటిని భూమిలో కలియదున్నడం ద్వారా భూమికి బలం పెరుగుతుందన్నారు. అవసరమైన పోషకాలు భూమికి సమకూరడంతో ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందన్నారు. పెట్టుబడి వ్యయం తగ్గడంతో నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుమలత, తిరుమలదేవిపేట, మక్కినవారిగూడెం, బండివారిగూడెం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విష్ణు బహిరంగ క్షమాపణ చెప్పాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎం.జీవరత్నం

జంగారెడ్డిగూడెం: వ్యవసాయ కార్మికులను గ్రామీణ సోమరి పోతులు అని అవమానకర వ్యాఖ్యలు చేసిన విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షురాలు యాగంటి సీత సమావేశానికి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎం.జీవరత్నం, సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు సోమరిపోతులుగా మారి పనులకు వెళ్లడం లేదని, అందువలనే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని జూన్ 29న విశాఖ జిల్లాలో వ్యవసాయ అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టే ఈ చట్టాన్ని తీసేయాలని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. ఈ పథకానికి కేంద్ర బడ్జెట్లో రూ.రెండు లక్షల 50 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.70 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. తక్షణమే విష్ణు కుమార్ రాజు ఉపాధి కూలీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఉపాధి కూలీలను ఐక్యం చేసి ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు, పిల్లి చంటి బత్తులవెంకన్న, వి.నరసింహ రావు, వబట్టా నాగరాజు. కె.సుబ్బారావు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన అవసరం


ద్వారకాతిరుమల ఎస్సై జి.సతీష్

ద్వారకాతిరుమల: ఈనెల 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ద్వారకాతిరుమల ఎస్సై జి.సతీష్ అన్నారు. భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేర చట్టాలు అమలులోకి వచ్చాయని, గతంలో అమలులో ఉన్న భారత శిక్షాస్మృతి (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్పీసీ), భారత సాక్ష్యాధార చట్టాల చరిత్ర గతనెల 31 అర్ధరాత్రితో ముగిసిందన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ 1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)ను, సీఆర్పీసీ 1973 స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)ను, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ)ను చట్టాలుగా మార్చినట్టు చెప్పారు. కొత్త చట్టాల అమలుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమైందన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పోలీసు సిబ్బంది శిక్షణ పూర్తి చేసుకున్నారని, కంప్యూటర్ వ్యవస్థలో అవసరమైన మార్పులు కూడా చేశారన్నారు. మారిన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సతీష్ సూచించారు.

కొత్త చట్టాల్లో మారిన శిక్షలు ఇవీ..

- కొత్త చట్టాలతో జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులను ఆన్‌లైన్లో నమోదు చేయడం, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ పద్ధతుల్లో సమన్లు పంపడం, హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్లను తప్పనిసరిగా వీడియోల్లో బంధించడం వంటి ఆధునిక పద్ధతులు న్యాయ వ్యవస్థలో రానున్నాయి.
- భారతీయ శిక్షాస్మృతి లోని రాజద్రోహాన్ని ఇప్పుడు దేశద్రోహంగా మార్చారు. కులం, మతం వంటి కారణాలతో సామూహిక దాడులు, హత్యకు పాల్పడితే ఐపీసీ ప్రకారం ఏడేళ్ల వరకు శిక్ష పడేది. ఇప్పుడు దీన్ని యావజ్జీవంగా మార్చారు. హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్ల వీడియో చిత్రీకరణ తప్పనిసరి చేశారు.
- నకిలీ నోట్ల తయారీ, వాటి స్మగ్లింగ్ ఉగ్రవాదం పరిధిలోకి వస్తుంది. విదేశాల్లో మన ఆస్తులు ధ్వంసాన్ని ఉగ్రవాదంగా నిర్వచించారు. డిమాండ్ల సాధనకు వ్యక్తులను బంధించడం, కిడ్నాప్ చేయడాన్ని ఉగ్రవాదం పరిధిలోకి చేర్చారు.

అత్యాచారాలకు మరింత కఠిన శిక్షలు

మహిళలు, పిల్లలపై నేరాలకు సంబంధించి కొత్త అధ్యాయాన్ని జోడించారు. పిల్లలను కొనడం, అమ్మడం ఘోరమైన నేరంగా మార్చారు. మైనర్‌పై సామూహిక అత్యాచారానికి మరణశిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన తెచ్చారు. పెళ్లి చేసుకుంటానని తప్పుడు వాగ్దానాలతో లైంగిక సంబంధాలు పెట్టుకుని మహిళలను వదిలేయడం వంటి కేసులకు కొత్త నిబంధన పెట్టారు. మహిళలు, పిల్లలపై నేరాల్లో బాధితులకు అన్ని ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స లేదా ఉచిత వైద్యం అందించాలి. మహిళలు, 15 ఏళ్ల లోపు, 60 ఏళ్లు పైబడిన వ్యక్తులు, వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఇంటి నుంచే పోలీసు సాయం పొందవచ్చు. కోర్టు అనుమతి లేకుండా లైంగిక దాడి గురించి ప్రచురిస్తే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు

ఫిర్యాదుల నుంచి సమన్లదాకా అన్నీ ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. పోలీసు స్టేషన్‌కు వెళ్లే పని లేకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా సమన్లు పంపవచ్చు. పరిధితో సంబంధం లేకుండా ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఎఫ్ఐఆర్ దాఖలు చేసేలా జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అరెస్ట్ అయిన వ్యక్తి కుటుంబానికి, స్నేహితులకు సమాచారాన్ని పంపించుకునే వీలు కల్పించడంతోపాటు వివరాలను పోలీస్ స్టేషన్లలో ప్రదర్శిస్తారు.